

"జిడ్చర్ల తాలూకాలోని చిన్న గ్రామం మాది. ఆ గ్రామపెద్ద నాగభూషణం నాయుడు. అతని మాటకు ఆ గ్రామంలో తిరుగులేదు. మంత్రిగారి వద్దనుండి మాంత్రికునివరకు, అతని ఆతిధ్యాన్ని స్వీకరించి, యథావిధి సహాయాన్నందిస్తూ వుంటారు. అతనికుమారుడు చిన్నానాయుడు. నేను కరెంటాఫీస్‌లో హెల్పర్‌గా పని చేస్తున్నాను. పెద్ద కుటుంబం. చిన్నజీతం. అయినా వున్న కాస్త పొలం స్వయంగా వ్యవసాయం చేసికొంటూ కాలక్షేపం చేస్తున్నాను. నాకు యిద్దరు పిల్లలు, భార్య, తల్లి, తండ్రి వున్నారు. తల్లి, తండ్రి వృద్ధాప్యంలో వుండడంతో భార్య పొలంపనులు చూస్తూ వుంటుంది. గుట్టుగా సాగుతున్న మా సంసారంలో నిప్పులు పోశాడు చిన్నానాయుడు. వొకనాడు నేను డ్యూటీకి వెళ్ళాను. నా భార్య పొలం వెళ్ళింది...." కాసేపాగాడు శేఖరంగా పరిచయం చేసికొన్న అతను. అతనికేసి చూశాను. కళ్ళనుండి నీళ్ళు ధారాపాతంగా కారి చెంపలు తడుపుతూ క్రిందికి జారుతున్నాయి. ఇక చెప్ప లేడని నేను గ్రహించే లోపునే, వస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక అతనే లేచి వెళ్ళాడు చేతుల్లో ముఖం దాచుకొని. మేనమామ అతన్ని అనుసరించాడు.

పాపం.... అనుకొన్నాను. వ్యక్తిగతంగా మంచివాడే. కాని ఆవేశంవల్ల అనుకోని అనర్థాలు జరుగుతూ వుంటాయి. శేఖరం మేనమామ ద్వారా మిగిలిన కథ విన్నాను.

శేఖరం ఆ రోజు ఆఫీసునుండి వచ్చాడు. భార్య యింట్లోలేదు. తల్లినీ తండ్రినీ అడిగాడు. పొలంవెళ్ళిందన్నారు. "అమ్మ.... చేను.... పోయింది" —వచ్చీరాని ముద్దు ముద్దు మాటలతో ముద్దుగా చెప్పాడు చిన్న కొడుకు. రాత్రి ఏడు కావస్తూంది సమయం. ఇంకా భార్య రాలేదు. పొలం వెళ్ళాడు. గుడిశెలోకి చూశాడు. భార్య పరుండివుంది. వెళ్ళి లేపుదామని తట్టబోయి స్థాణువై పోయాడు. జాకెట్.... బ్రా.... చిరిగి వున్నాయి. వక్షస్థలం నగ్నంగా వుంది. ఆ ప్రదేశంలో గోళ్ళరక్కులు వున్నాయి. బుగ్గలపై పంటిగాట్లున్నాయి....లంగా అస్తవ్యస్తంగా వుంది. చీరె దూరంగా వొక మూల పడి వుంది. పెనుగులాట జరిగిన దానికి నిదర్శనంగా గుడిసెలోని వస్తువులు ఛిన్నాభిన్నమై వున్నాయి. పరిస్థితి అర్థమైంది. భార్య బలాత్కరింప బడిందని గ్రహించాడు. చేయిపట్టి చూశాడు. మంచులా చల్లగా వుంది. అంతా అయిపోయింది. గుండె ఆగిపోయింది .... తరువాత చెరువైంది. కట్టతెగి కన్నీరై పారింది.

పోలీస్‌స్టేషన్‌లో రిపోర్టిచ్చాడు. శవాన్ని వశపరచుకొని పరీక్ష జరిపించారు. ఎక్కువ మంది బలవంతంగా అనుభవించడంవల్ల ప్రాణం పోయిందని తేల్చారు. ఇల్లు శోకసముద్రమే అయింది. పిల్లల ఘోష భరింపలేక పోయాడు. ప్రక్క గ్రామంనుంచి వార్త విని మేనమామ, అతని భార్య వచ్చారు. పరిశోధన జరుగుతూంది. ఏమీ తేల్చలేక పోయారు పోలీసులు.

రెండు రోజులు గడిచింది. మేనమామ భార్య పొలం వెళ్ళింది. ఆరోజు ఆదివారం అవటంవల్ల శేఖరం ఇంటివద్దనే వున్నాడు. మధ్యాహ్నం 12 గంటలకు 10 నిమిషాలు తక్కువగా వుంది. మేనమామ భార్య రొప్పుకుంటూ యిల్లు చేరింది! విపరీతంగా పరుగెత్తడం వల్ల మాట రావడంలేదు. భయంతో వణికిపోతూంది. కాసేపయాక అతికష్టంమీద చెప్పింది - చిన్నానాయుడు, యింకా నలుగురు కుర్రాళ్ళు తనను బలాత్కరించబోగా తప్పించుకొని వచ్చానంది.

మేనమామను వెంట తీసికొని పొలం వెళ్ళాడు శేఖరం. ప్రక్క మామిడితోటలో వున్నారు ముఠా. శేఖరం ఆవేశం హద్దులు దాటింది. మేనమామ వారించినా ఫలితం లేకపోయింది. గుడిసెలో వున్న గడ్డికోసే కత్తి తీసుకొన్నాడు. పరుగెత్తి పోయాడు తోటలోకి. ఇతని వాలకం చూసి అంతా పరుగెత్తారు. కాని చిన్నానాయుడు దొరికిపోయాడు. ఒక్కటే దెబ్బ బలంగా వేశాడు తలపై కత్తితో. క్రింద పడిపోయాడు చిన్నానాయుడు. తన యిష్టం వచ్చినట్లు కత్తితో కొట్టాడు శేఖరం మేనమామ అడ్డు పడినా. చిన్నానాయుడు అప్పటికే మరణించాడు.

తరువాత తెలిసింది. తన భార్య మరణానికి కూడా చిన్నానాయుడే కారణమని. శేఖరాన్ని హత్యాపరాధంపై జైలుకు పంపారు. "....సంభవామి యుగే యుగే!"




ప్రక్కనున్న ఆంజనేయస్వామి నిలయం నుంచి శ్లోకం వినవస్తూంది. నవ్వుకున్నాను.... సంభవమా.... అని.

—ప్రసాద్